క్లుప్తంగా

బెల్టు షాపుపై పోలీసు దాడులు

అల్లవరం: మండలంలోని కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని గుబ్బలవారిపాలెంలో అనధికారిక బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పాన్‌షాపుపై సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 36 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తున్న నిర్వాహకుడు మామిడిశెట్టి వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం: పురుగుల మందు సేవించిన మధుర గోపాలకృష్ణ(27) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం క్రాప చింతలపూడిపాలెం గ్రామానికి చెందిన గోపాలకృష్ణ బుధవారం పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో బంధువులు హుటాహుటిన అమలాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో హెచ్‌సీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేద్దాం

ఐ.పోలవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ వి.చిరంజీవి రావు కోరారు. మురమళ్ల టీడీపీ కార్యాయలంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు. మాజీ శాసన మండలి ఉప సభాపతి రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు నాగిడి నాగేశ్వరరావు, మోకా ఆనంద్ సాగర్‌లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నాయకుల నిరసన

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలు అమలు కానందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో పీసీసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రకటించిన హామీలలో ఒక పెన్షన్ తప్ప ఏ ఒక్క హామీ అమలు పరచ లేదన్నారు. అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ముమ్మిడివరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాలెపు ధర్మారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముషిణి రామకృష్ణారావు, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, మహమ్మద్ ఆరిఫ్, పీసీసీ మెంబర్ మాచవరపు శివన్నారాయణ, బీసీ నాయకులు కుడిపూడి శ్రీనివాస్, నిమ్మకాయల ప్రసాద్, మహబూబ్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు డాక్టరేట్


డాక్టరేట్ సాధించిన వదలి శ్రీనివాస్

తాళ్లరేవు: కైట్ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ అధ్యాపకుడు, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ వదలి శ్రీనివాస్ కాకినాడ జేఎన్‌టీయూకే ద్వారా డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో డీప్ లెర్నింగ్ ద్వారా కాలేయం సమస్యల విశ్లేషణ, విభజన, తీవ్రత అంచనా అనే అంశంపై అధునాతన పద్ధతులతో పరిశోధనలు నిర్వహించినందుకు గానూ కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీ నుంచి ధృవీకరణ పత్రం అందినట్లు చెప్పారు. ఈ పరిశోధన జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌లు డాక్టర్ జీవీఎస్‌ఆర్ దీక్షితులు, డాక్టర్ జీవీఆర్ మూర్తి పర్యవేక్షణలో జరిగినట్లు శ్రీనివాస్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పొన్నాడ పరామర్శ

ఐ.పోలవరం: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పరామర్శించారు. మండలం పరిధిలోని జి.వేమవరం గ్రామంలో మాతృ వియోగంతో బాధ పడుతున్న ఎంపీటీసీ చోడిశెట్టి జ్యోతి సత్తియ్య నాయుడు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. కొమరగిరి గ్రామానికి చెందిన స్థానిక నాయకులు రాయపూడి కొండ కుమారుడు హరీష్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకట పతిరాజు, ఏలూరి ఆదినారాయణ, సుంకర నాగబాబు, మెండ వెంకన్న, విధి వంశీ, రవి, గంగబాబు, మూర్తి, సీతా రాములు పాల్గొన్నారు.

ఎన్నాళ్లు.. ఎన్నేళ్లు!

- నత్తనడకన జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు
- ప్రారంభించి ఐదేళ్లు పూర్తి
- వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- ఎదురు చూస్తున్న విద్యార్థులు


నిర్మాణంలో ఉన్న జాతీయ ఇంజినీరింగ్ కళాశాల

యానాం: నియోజకవర్గ పరిధిలోని గిరియాంపేటలో రూ.26 కోట్ల రూసా నిధులతో ప్రభుత్వ జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి అంగరంగ వైభంగా భూమి పూజ నిర్వహించారు. ఇది పూర్తయితే ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి పుదుచ్చేరి తదితర ప్రాంతాలకు వందలాది కిలోమీటర్ల దూరం వెళుతున్న విద్యార్థుల బాధలు తీరతాయని స్థానిక ప్రజలు భావించారు. అయితే పనులు ప్రారంభించి ఐదేళ్లు పూర్తయినా ఇంకా ప్రారంభానికి నోచుకోని దుస్థితి దాపురించింది. ఇటీవల కాలం నుంచి వివిధ కారణాలతో పనులు నిలిపివేశారు. వచ్చే విద్యా సంవత్సరం లోనైనా తరగతులు ప్రారంభమవుతాయనని స్థానిక విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

వర్చువల్ విధానంలో శంకుస్థాపన

కేంద్ర మానవ వనరుల అభివద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 70 మోడల్ డిగ్రీ కళాశాలలు, 11 వృత్తి విద్యా కళాశాలలు, ఒక మహిళా యూనివర్శిటీకి 2019 ఫిబ్రవరి 3న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా జమ్మూకాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి డిజిటల్ ఫౌండేషన్ స్టోన్ వేశారు. దీనిలో భాగంగా యానాంకు మంజూరైన జాతీయ ఇంజినీరింగ్ కళాశాలకు సైతం మోదీ శంకుస్థాపన చేశారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ ఇంజినీరింగ్ కళాశాలగా నామకరణం చేశారు.

కళాశాలలో ప్రస్తుత ఆధునిక సాంకేతికతకు ఉపకరించే 5 కోర్సులు ప్రారంభించనున్నారు. రోబోటిక్ ఆటోమేషన్, జియో-ఇన్ఫర్మేటిక్స్ ఇంజినీరింగ్, 3డీ యానిమేషన్, గ్రాఫిక్స్ ఇంజినీరింగ్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఇంజినీరింగ్, కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా ఇంజినీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. జాతీయ కళాశాల కావడంతో 50 శాతం సీట్లు పుదుచ్చేరికి, 50 శాతం సీట్లు వివిధ రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించనున్నారు.

పెరుగుతున్న నిర్మాణ వ్యయం

గిరియాంపేట గ్రామంలో రూ.26 కోట్ల రూసా నిధులతో నూతన నేషనల్ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. స్థానిక పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ) అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నప్పటికీ ఇవి ఎప్పుడు పూర్తవుతాయే తెలియని అయోమయ స్థితి నెలకొంది. ఇప్పటికే తరగతుల నిర్వహణకు కళాశాలకు ఏఐసీటీఈ సైతం అనుమతిచ్చింది. అయినప్పటికీ నిర్మాణాలకు అవుతున్న ఖర్చు పెరిగి పోతుండటంతో పాటు మళ్లీ కొత్తగా కోట్లాది రూపాయలు కావాలంటూ ప్రభుత్వాన్ని అధికారులు కోరుతుండటంతో అవి కాస్తా మంజూరు కాక భవనాలు అసంపూర్తిగా ఉంటున్నాయని అంటున్నారు. ఇప్పటివరకు కళాశాలలో మూడు బ్లాక్‌లు మాత్రమే నిర్మాణం జరిగింది. మిగిలిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రహదారులు, ప్రహరీగోడ, డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఎదురుగా ఖాళీ స్థలాన్ని మట్టితో నింపాల్సిన పనులు సైతం ఉన్నాయి. ఎలక్ట్రీషియన్ పనులు సైతం పూర్తి స్థాయిలో పూర్తి కావాల్సి ఉంది.


ప్లాస్టరింగ్ పూర్తికాక దర్శనమిస్తున్న మొండి గోడలు


వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ(ఫైల్)

అదనపు నిధులకు నివేదిక

జాతీయ ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. భవన నిర్మాణాలు, ప్రహరీ గోడకు మరిన్ని నిధులు కావాల్సి ఉంది. ఇంకా ఎంత మొత్తం కావాలో తెలుపుతూ ఇప్పటికే సంబంధిత అధికారులకు నివేదిక పంపాం. అవి విడుదల కావాల్సి ఉంది.

పీడబ్ల్యూడీ ఇంజినీరింగ్ అధికారులు, యానాం.

ఇరువురికి గాయాలు

ముమ్మిడివరం: జాతీయ రహదారిలోని వై.జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు బలంగా ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ముమ్మిడివరం ఎస్సై జ్వాలా సాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉంది.

అగ్రికల్చర్ అసిస్టెంట్ మృతి

ముమ్మిడివరం: మండల పరిధిలోని గేదెల్లంక గ్రామానికి చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్ కవురు సీమాన్‌రాజు అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. సీమాన్‌రాజు మృతికి ఎంపీపీ కోలా గంగా భవాని, ఎంపీడీఓ టి.వెంకటాచార్యతో పాటు పలువురు నాయకులు, అధికారులు సంతాపం తెలిపారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: ఎస్టీయూ రాష్ట్ర సంఘం రూపొందిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. రూరల్ మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 750 మంది పదో తరగతి విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్‌లు శనివారం అందించారు. ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్, మండల ఎస్టీయూ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్, మండల ఆర్థిక కార్యదర్శి బాలనాగు గుప్తా పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి


కోరంగి గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ పెయ్యల మంగేష్

తాళ్లరేవు: ప్రణాళికా బద్ధంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజలంతా సహకరించాలని సర్పంచ్‌లు కోరారు. శనివారం మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళికల పట్ల గ్రామసభలు నిర్వహించారు. సుంకరపాలెంలో టిళ్ల పూడి నాగేశ్వరరావు, కోరంగిలో సర్పంచ్ పెయ్యల మంగేష్, తాళ్లరేవులో రెడ్డి అరుణ, సుహాసినీ దేవి, పి.మల్లవరంలో పంపన రామకృష్ణ, పోలేకుర్రులో వెంటపల్లి నూకరాజు అధ్యక్షతన గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ తెరిచి ఉపాధి కల్పించాలి

యానాం: గత 30 ఏళ్లుగా వివిధ రకాల మందులు తయారు చేస్తున్న లార్డ్ వెంకీ ఫార్మా కంపెనీని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి దుర్గాప్రసాద్ కోరారు. ఈ నెల 16న నందికోళ్ల వీరభద్రరావు అనే కార్మికుడు విధుల్లో ఉండగా మృతి చెందారని దీంతో అప్పటి నుంచి ఫ్యాక్టరీని అనూహ్యంగా మూసి వేశారన్నారు. దీంతో ఫ్యాక్టరీపై ఆధారపడి ఉన్న సుమారు 50 మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి ఫ్యాక్టరీని పునఃప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రూ.75 నాణేల సేకరణ


సుప్రీంకోర్టు ముఖ చిత్రంతో ముద్రించిన రూ.75 నాణెం

అమలాపురం టౌన్: స్వతంత్ర భారత దేశం గణతంత్ర రాజ్యంగా ఏర్పడి 75 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా కోల్‌కత్తా, ముంబై టంకశాలలు మూడు రూ.75 నాణేలను విడుదల చేశాయి. ఈ నాణేలను అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్తా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముంబై టంకశాల 40 గ్రాముల పూర్తి వెండితో నూతన పార్లమెంట్ ముఖ చిత్రంతో రూ.75 నాణేన్ని, కోల్‌కత్తా టంకశాల భారత రాజ ముద్రతో రూ.75 నాణేన్ని, భారత దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) ముఖచిత్రంతో రూ.75 నాణేన్ని విడుదల చేశాయి. ఆ రెండు నాణేలు 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ మిశ్రమంతో రూపొందించబడ్డాయి. ఒక్కో నాణెం 35 గ్రాముల బరువుతో ముద్రించారు.

ఆటో టిప్పర్ డ్రైవర్ల సమ్మె విరమణ


మున్సిపల్ కమిషనర్ రాజుతో చర్చిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, టిప్పర్ల డ్రైవర్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో క్లాప్ పథకం ద్వారా ఇంటింటా చెత్తను సేకరించే ఆటో టిప్పర్ డ్రైవర్లు తమ సమ్మెను విరమించి శనివారం ఉదయం నుంచి విధులకు హాజరయ్యారు. తమ పెండింగ్ జీతాల కోసం అయిదు రోజులుగా వాహనాలను నిలిపివేసి సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే.

మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు శనివారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో టిప్పర్ల యూనియన్ నాయకులతో జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. సోమవారం నాడు మూడు నెలల పెండింగ్ జీతాలను డ్రైవర్ల బ్యాంక్ అకౌంట్లలో వేసేందుకు కమిషనర్ హామీ ఇవ్వడంతో వారు సమ్మెను విరమించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కె.సత్తిబాబు, కొప్పుల బాబి, నిమ్మకాయల శ్రీనివాసరావు, కుంచే అరుణకుమార్, యనమదల మురళీకృష్ణ తదితరులతో కమిషనర్ రాజు చర్చలు జరిపారు.

సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ


సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

యానాం: పుదుచ్చేరిలో జరుగుతున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో యానాం శారదా ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని శనివారం ప్రధానోపాధ్యాయులు చిక్కాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. చింతా శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముక, సంగాడి అజయ్ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌కు ప్రత్యేక బహుమతులు వచ్చాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 7 దక్షిణాది రాష్ట్రాల నుంచి 190 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారన్నారు. విద్యార్థులు బహుమతుల సాధనకు వారికి తర్ఫీదు నిచ్చిన గైడ్ టీచర్ కందుకూరి సురేష్‌కుమార్‌ను పాఠశాల యాజమాన్యం, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కంచర్ల చిన్నబ్బాయి, కాపగంటి ఉమా శంకర్ తదితరులు అభినందించారు.

రైతు బజార్ పునః ప్రారంభం


రైతు బజార్‌ను పునః ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, జేసీ నిషాంతి, జిల్లా అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురంలో మూత పడ్డ రైతు బజార్ శనివారం ఉదయం పునః ప్రారంభమైంది. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో గల ఈ రైతు బజార్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.లావణ్య, ఆర్డీవో కె.మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి కేఎస్‌వీ విశాలాక్షి, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ పర్యవేక్షణలో ప్రారంభమైన రైతు బజార్‌లో కూరగాయల దుకాణాలతో పాటు చేపలు, మాంసం దుకాణాలు, బియ్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. జాయింట్ కలెక్టర్ నిషాంతి మాట్లాడుతూ రైతులు పండించే కూరగాయలు నేరుగా అమ్ముకునే అవకాశాన్ని ఈ రైతు బజార్ పునః ప్రారంభం ద్వారా కల్పించామన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ పునః ప్రారంభించిన రైతు బజార్‌లో కూరగాయల వ్యాపారులకు అవసరమైన కనీస వసతులైన రోడ్లు, మరుగుదొడ్లు, దుకాణాల ఆధునీకరణతో అన్ని ఏర్పాటు చేశామన్నారు. జేసీ, ఎమ్మెల్యే, ఆర్డీవో తదితరులు కూరగాయలు, చేపలు, మాంసం, కిరాణా దుకాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయ వెంకటలక్ష్మి, తహసీల్దార్ అశోక్ పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరం


తాళ్లరేవు పశు ఆరోగ్య శిబిరంలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఏడీ బ్రహ్మవేద

తాళ్లరేవు: పశువుల సంరక్షణ, వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరం శనివారం తాళ్లరేవులో జరిగింది. స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో ఏడీ బ్రహ్మవేద పర్యవేక్షణలో వైద్యులు దవులూరి సుధ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాల దిగుబడిని పెంచేందుకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, మందులను రైతులకు అందజేశారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పశువులకు తవుడును అందజేశారు. పశువుల ఆస్పత్రికి వచ్చే పాడిరైతులు కూర్చొనేందుకు రెండు సిమ్మెంటు బల్లలను లయన్స్ ప్రతినిధులు బి.శ్రీనివాసరెడ్డి, సతీష్, దత్తు, ఆదినారాయణ, వీరబాబు తదితరులు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత


బాధితుడికి సాయం అందిస్తున్న శెట్టి బలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

అమలాపురం రూరల్: సాకుర్రు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గుత్తుల ఆనంద్ బాబు గుండె చికిత్స నిమిత్తం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యుల ద్వారా వసూలు చేసిన రూ.75 వేలు, హైదరాబాద్ గుత్తుల మీరాకుమార్ చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేలు వెరసి రూ.85 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గుత్తుల చిరంజీవి, చెల్లుబోయిన నాని, మాజీ సర్పంచ్ చోల్లంగి సాయిబాబా, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాములు అందించారు. ఈ కార్యక్రమంలో దంగేటి రుద్ర, గొవ్వాల సత్య తిరుపతి రావు, కముజు రమణ, దొమ్మేటి వెంకటేశ్వరావు, విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్ మట్టపర్తి జలంధర్, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అల్లవరం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాజ్యాంగంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఓడలరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించినట్లు పాఠశాల హెచ్‌ఎం కేఎస్ఆర్ మూర్తి శనివారం తెలిపారు. అమలాపురంలోని గోదావరి భవన్‌లో జరిగిన క్విజ్ పోటీల్లో ఓడలరేవు పాఠశాలకు చెందిన ఎం.లాస్య, పి.గాయత్రి, కే.ప్రసన్న ఉత్తమ ప్రతిభ చాటారని తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటారని చెప్పారు.

వెంకన్న ఆలయానికి సంప్రోక్షణ

అల్లవరం: సామంతకుర్రులో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో పురోహితులు పోచినపెద్ది వెంకట కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ సంప్రోక్షణ నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి ఇద్దరు ఆగంతకులు ఆలయంలోకి చొరబడి స్వామి వారి వెండి ఆభరణాలను చోరీ చేసిన విషయం విదితమే. స్వామి వారి గర్భగుడిలోకి ఆగంతకులు ప్రవేశించి అపవిత్రం చేయడంతో వేద పండితులు వేద మంత్రోచ్చారణతో సంప్రోక్షణ నిర్వహించి హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటుతోనే నవ సమాజ నిర్మాణం

- ఘనంగా ఓటరు దినోత్సవం
- పలుచోట్ల ర్యాలీలు, మానవ హారాలు
- సీనియర్, యువ ఓటర్లకు సత్కారాలు

తాళ్లరేవు: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పితాని త్రినాధ రావు కోరారు. శనివారం తాళ్లరేవులో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లరేవు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించి ఓటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జె.ఆశాలత, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు ఎస్.వీరబాబు, సత్యవతి, ఉపాధ్యాయులు పుల్లేటి కిషోర్, వాకపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


తాళ్లరేవులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ముమ్మిడివరం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.శాంతకుమారి అన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం రెవెన్యూ శాఖ, నగర పంచాయతీ, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సహాయ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ ఎంవీఎస్ లక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి శాంతికుమారి హాజరై మాట్లాడుతూ పద్దెనిమిదేళ్ల వయస్సు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని ఈ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ ఓటరు డబ్బుకు, మద్యానికి లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువ ఓటర్లు, ఎక్కువ సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ గోపాల కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో యువ ఓటరును సత్కరిస్తున్న అధికారులు

అల్లవరం: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాని, ఓటుతోనే దేశ భవిష్యత్ మారుతుందని వైస్ ఎంపీపీ వడ్డి గంగ అన్నారు. గోడిలంకలో వీఆర్‌ఓ చంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఓటర్స్‌డే పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక పర్యాయాలు ఓటు వేసిన చింతలపూడి సత్యవతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, శెట్టిబత్తుల తులసీరావు, ఉపాధ్యాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

కలెక్టర్ మహేష్ కుమార్


సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్, జేసీ నిషాంతి తదితరులు

అమలాపురం రూరల్: దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలక భూమిక పోషిస్తాయని ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శనివారం అమలాపురం మండలం ఇందుపల్లిలో భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే అర్హులైన వారంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తలరాతలు మార్చే శక్తి ఓటు హక్కుకు ఉందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి మాట్లాడుతూ ఎన్నికలు ప్రజల సార్వభౌమాధికారానికి సూచికగా నిలుస్తాయన్నారు. వ్యాసరచన, రంగోలి పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ సేవలందించిన బీఎల్‌ఓలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జేవీ రామారావు, తహసీల్దార్ పలివెల అశోక్, ఏవీ కృష్ణారావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.